## క్లుప్తంగా

### పీఎంపీ రాజా కన్నుమూత



రాజా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఎంపీ నాయకులు

మండపేట: పీఎంపీగా పట్టణ ప్రజలందరికీ సుపరిచితుడైన మంగిపూడి రాజా భాస్కర్ (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన ప్రజల్లో మంచి వైద్యునిగా గుర్తింపు పొందారు. ఈయన తండ్రి ప్రకాశరావు కూడా పీఎంపీగా నాలుగున్నర దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న రాజా ఎంతోమంది పేదలకు ఉచితంగా వైద్యం చేసి పంపేవారు. ఈయన కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం మరణించారు. పీఎంపీ సంఘ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాలు వద్ద రాజా చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ నాయకులు బల్లా వెంకటరమణ, మారిశెట్టి సత్యనారాయణ, వానపల్లి కనకరాజు, ఇందన వెంకటేశ్వరరావు, సుంకర బాలాజీ, ఇమంది నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రైవేటు'కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను మెరుగుపర్చాలి



పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీఈఓ రమేష్

కాజులూరు: గ్రామాల్లో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరచాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. గురువారం మండలంలోని కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల బోధనాభ్యాస స్థాయిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాలు, ఎన్ఎంఎంఎస్ సెలక్షన్స్, క్రీడల్లో స్థానిక విద్యార్థుల ప్రతిభ, విద్యార్థులలో నైపుణ్యం పెంపొందింపుపై అవగాహన కల్పించారు. స్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: లైన్ల నిర్వహణ కారణంగా రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఏపీఈపీడీసీఎల్ ఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి నదురుబాద వెళ్లే 11 కేవీఏ ఫీడర్‌లో ట్రీ కటింగ్, మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు చెప్పారు. రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద గ్రామాలకు అంతరాయం ఏర్పడనుందన్నారు.

### ధనలక్ష్మి సేవలు ఎనలేనివి



ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద ధనమ్మకు నివాళి అర్పిస్తున్న డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో ఆశా వర్కర్‌గా సేవలందించి ఈ నెల 17న గుండెపోటుతో మృతి చెందిన ఎస్.ధనలక్ష్మి (57) సేవలు ఎనలేనివని రామచంద్రపురం డివిజన్ మెడికల్ ఆఫీసర్, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో గురువారం ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బందితో కలసి ధనమ్మ మృతికి సంతాపం తెలిపారు. గడచిన 18 ఏళ్లుగా ఆమె అంకితభావంతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, స్టాఫ్ నర్సు భవాని, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రతి నీటి బొట్టును ప్రాణపదంగా భావించాలి

సఖినేటిపల్లి: ప్రతి నీటి బొట్టును ప్రాణపదంగా భావించాలని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. గురువారం సఖినేటిపల్లిలంకలో విద్యార్థులకు, గ్రామస్తులకు సేవ్ వాటర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుచున్న ఏడు రోజులు షెడ్యూల్‌లో భాగంగా ఏడవ రోజు పై కార్యక్రమం ఆమె చేపట్టారు. పాఠశాలల్లో, గృహాల్లో నీటి దుర్వినియోగం అరికట్టాలని ఆమె సూచించారు. అలాగే వాటర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలల్లోను విద్యార్థులకు నీటి ఆవశ్యతక గురించి తెలియజేయాలన్నారు.

# యోగానందం

**ఒకప్పుడు ఇదే పురాతన ప్రక్రియ. పుస్తకాలకే పరిమితమైందన్న భావన. అదే నేడు ఓ జీవన విధానంగా మారి యావత్ ప్రపంచాన్నే అబ్బురపరుస్తోంది. ప్రాచీన ప్రాధాన్యమున్న యోగాను జీవితంలో భాగం చేసుకుని ఆచరించడం ప్రజలకు అలవాటుగా మారింది.**

- శాస్త్రీయ జీవన శైలికి ఉపయుక్తం
- నానాటికీ ప్రజల్లో పెరుగుతున్న ప్రాధాన్యం
- ప్రచార కార్యక్రమాల్లో సామాజికవేత్తలు
- నేడు అంతర్జాతీయ యోగా డే

కపిలేశ్వరపురం: భారతదేశంలో యోగాసనాలు ఆధ్యాత్మిక కార్యాచరణతో వ్యక్తమవుతుంది. సుషుమ్న, హరికేశం, విశ్వకర్మ, విశ్వవ్యచ, సంపద్వసు, అర్వాగ్వసు, స్వరాడ్వసు అనే సప్త రశ్ములున్న సూర్యుడిని సప్తమినాడు పూజించు ప్రక్రియగా నిలిచిన రథ సప్తమి వేడుకలో యోగాసనాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ కథనం.

**ఉపాధి మార్గమై..**

రెండు నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయులు విద్యార్థులకు యోగాసనాలను నేర్పుతున్నారు. వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు ప్రతిభను కనబర్చుతున్నారు. మరికొందరు యోగా శిక్షణా కేంద్రాలను, శిక్షణా తరగతులను నిర్వహించడాన్ని ఉపాధి మార్గంగా చేపట్టారు. మండపేట మండలం అర్తమూరుకు చెందిన, హైదరాబాద్‌లో స్థిరపడిన మేడపాటి వెంకటరెడ్డి యోగాపై ఆసక్తితో 1960లో మహారాష్ట్ర లోనావ్లాలోని కైవల్యాధాం సంస్థలో పీజీ డిప్లమా చేశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రుషికేష్‌లోని మహర్షి మహేసుయోగి మెడిటేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాన్సెండెంటల్ మెడిటేషన్, సైన్స్ ఆఫ్ క్రియేటివ్ ఇంటలిజెన్స్ కోర్సుల్లో శిక్షణ పొందిన తొలి ఆంధ్రునిగా గుర్తింపు పొందారు. 1978లో ప్రారంభించిన ప్రభుత్వ వేమన యోగ పరిశోధన సంస్థలో సూపర్‌వైజర్‌గా, డైరెక్టర్‌గా 27 ఏళ్లపాటు సేవలందించి రిటైరయ్యారు. 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏపీ యోగాధ్యయన పరిషత్ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అదే విధంగా రామచంద్రపురం మండలం తాడిపల్లికి చెందిన ఆశా వర్కర్ కుమార్తె, ప్రైవేటు విద్యా సంస్థ పీఈటీ కమిడి రమ్య 12 ఏళ్ల వయస్సు నుంచి యోగాసనాలను తర్ఫీదు పొందారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు వేదికల్లో ప్రతిభను కనబర్చారు. జాతీయ స్థాయిలో ఆరు, ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో ఒకటి, పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. యోగా డిప్లమో కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలో వ్యాయామోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అలాగే కె.గంగవరానికి చెందిన కాద రాంబాబు శ్రీవిజయ గాయత్రి పేరుతో ధ్యాన, ఆరోగ్య, యోగా శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తూ పాఠశాల స్థాయి నుంచి యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. రాయవరం మండలం లొల్లలోని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాసచౌదరి యోగా శిక్షకుడిగా సేవలందిస్తున్నారు. అంగర, పడమర ఖండ్రిక, మండపేట తదితర ప్రాంతాల్లో యోగా శిక్షణా తరగతులను తరచూ నిర్వహిస్తున్నారు.




సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

**యోగా ప్రాధాన్యమిదీ..**

ప్రకృతి వికృత చేష్టల నేపథ్యంలో తలెత్తే ఆరోగ్య సమస్యల నుంచి యోగాసనాలు కాపాడేవి. సైన్స్ ప్రచారం పెరిగిన ప్రస్తుత కాలంలో మానవ జీవన విధానం పూర్తిగా మారింది. శారీరక శ్రమ తగ్గడం, మానసిక బాధలకు గురికావడం తదితర కారణాలతో మానసిక, శారీరక సమస్యల్లో మనిషి చిక్కుకున్నాడు. ఇలాంటి నేపథ్యంలో ధ్యానం, యోగా వంటి ప్రాచీన విధానాలకు ప్రాధాన్యం పెరిగింది. యోగా అనేది సంస్కృతంలోని యుజ్ అనే పదం నుంచి వచ్చింది. ఈ పదానికి ఐక్యం కావడమని అర్థం. మనసు, శరీరమూ ఒకదానితో మరొకటి ప్రభావితమై ఉంటాయి. ఆ రెండింటినీ ఏకం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. యోగాలోని 84 ఆసనాల్లో 32 అతి ముఖ్యమైనవి. క్రమం తప్పకుండా యోగాసనాలను వేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఆలోచనలను నియంత్రించుకోగలుగుతారు.



ప్రధాన యోగాసనాల విధానం

### సూర్య నమస్కారాలతో..

సూర్య నమస్కారాల్లోని ఆసనాల్లో ఆరోగ్య, ఆధ్యాత్మిక అంశాలు ఒదిగి ఉంటాయి. వాటిని చేయడం ద్వారా కదలికలు ఏర్పడి శరీరావయవాల్లోని భాగాలకు రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది.

- ప్రణామాసనాన్ని వేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది.
- హస్త ఉత్థానాసనంతో ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. అధిక బరువును తగ్గిస్తుంది.
- హస్తపాదాసనం ద్వారా ఉదర భాగంలో కొవ్వు కరుగుతుంది. జీర్ణ క్రియ పనితీరు పెరుగుతుంది.
- ఏకపాద ప్రసారణాసన్ ద్వారా నాడీ మండల వ్యవస్థను ఉత్తేజితం చేసి, ఉదరావయవాల సామర్థ్యం పెంచుతుంది.
- దండాసనం ద్వారా కాళ్లు, చేతులు, భుజాల కండరాలను బలిష్ఠంగా చేసి, శరీర సమతుల్యం పెంచుతుంది.
- అష్టాంగాసనం ద్వారా గుండె పనితీరు మెరుగుపడుతుంది.
- భుజంగాసనం వల్ల వెన్నునొప్పి, ఉబ్బసం, సెర్వికల్ స్పాండిలైటిస్ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పర్వతాసనం ద్వారా నడుం చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది.
- వీటి తర్వాత అశ్వ సంచలనాసనం, హస్త పాదాసనం, హస్త ఉత్థానాసనం, ప్రాణామాసనం ఉన్నాయి.

## సికిల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలి



ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్ తదితరులు

రామచంద్రపురం: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని లక్షణాలు ఉంటే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందన్నారు. దీంతో పాటుగా జీవనశైలిలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా కూడా వ్యాధి సోకుతుందన్నారు. జంక్‌ఫుడ్స్ తీసుకోవటం వల్ల, శరీరంలో మార్పులు చోటు చేసుకుని రక్తంలో మార్పులు సంభవిస్తాయన్నారు. సికిల్ సెల్ ఎనీమియా అంటే కోడిగుడ్డు ఆకారంలో ఉండే రక్తకణాలు ఈ వ్యాధి సోకడం ద్వారా అర్ధ చంద్రాకారంలా మార్పు చెందుతుందన్నారు. దీని మూలంగా రక్తంలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోయి, మనిషి నీరసంగా ఉంటూ రాను రాను ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ఇలా చివరకు ప్రాణహానీ కూడా జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనిని మొదట్లోనే రక్త పరీక్షల ద్వారా గుర్తించి తగిన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం వచ్చేనెల 3వ తేదీ వరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు డాక్టర్ ప్రవీణ్ వెల్లడించారు. ఎవరికైనా నీరసం రక్తంలో తేడాలను గమనిస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ వీరభద్రుడు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చైర్‌పర్సన్ పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో ఇటీవల వివిధ కారణాల వల్ల మృతి చెందిన బాధిత కుటుంబాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పరామర్శించారు. గురువారం చైర్‌పర్సన్ దుర్గారాణి పలువురు కౌన్సిలర్లతో కలిసి 8, 12, 20 వార్డుల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. న్యాయవాది కేఆర్‌సీ నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు. 12వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన పెమ్మనబోయిన బాపిరాజు కుటుంబాన్ని, 20వ వార్డు వైఎస్సార్ కాలనీలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మృతుడి తల్లిదండ్రులను, 8వ వార్డులో దార్ల లాజరు కుబుంబ సభ్యులను పరామర్శించారు. కౌన్సిలర్లు గ్రంధి శ్రీనివాస్, మలసాని సీతామహాలక్ష్మి, మందపల్లి రవికుమార్, నాయకులు మలసాని అప్పన్న దొర, కొడమంచిలి భాస్కరరావు, పేరూరి మాధవి, పేనెడ్డి కృపావతి, మోర్తా శ్యామ్, సేనాపతి దొర బాబు, యాదగని చంటి తదితరులు ఉన్నారు.

## ఖరీఫ్ నారుమడుల పరిశీలన



కడలిలో నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ నందకిషోర్

రాజోలు: ఖరీఫ్ నారుమడులను ఏరువాక జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ గురువారం పరిశీలించారు. మండలంలోని కడలి, కూనవరం గ్రామాల్లో పర్యటించి 2024 ఖరీఫ్ వరి నారుమడుల సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. నారుమడి వేసుకునే భూమిని మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నారుమడిలోకి సాగునీరు లోపలకు, బయటకు వెళ్లే విధంగా చిన్న చిన్న కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఐదు సెంట్లు నారుమడి సిద్ధం చేసుకునేందుకు ఐదు కేజీల యూరియాకు ఒక కిలో భాస్వరం కలిపి మొత్తం ఆరు కిలోల ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువు వేయాలన్నారు. ప్రతి ఐదు సెంట్ల భూమికి 25 కేజీల విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసి మొలక కట్టాలన్నారు. కూనవరంలోని వరి నారుమడులను పరిశీలించి రైతు ఉప్పు వీరభద్రరావుకు కొత్త వరి వంగడం ఎంటీయూ-1310 విత్తనాలను 20 కేజీలు అందజేశారు. అలాగే ఎంటీయూ-1318, ఎంటీయూ-7029(స్వర్ణ) రకాల వరి విత్తనాలను అందజేసి విత్తనాభివృద్ధి చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి మధుకుమార్, వీఏఏలు బీసీఆర్‌కే రాజు, శివరామకృష్ణ, వీహెచ్ఏ ఉమ తదితరులు పాల్గొన్నారు.

## వికసించిన పుష్పాలు



మూలస్థాన అగ్రహారం వద్ద 216 ఏ జాతీయ రహదారిలో నెల రోజుల క్రితం మోడు వారిన తురాయి చెట్లు (నాడు)



మూలస్థాన అగ్రహారం వద్ద వికసించి అందాలు విరబూస్తున్న తురాయి చెట్లు (నేడు)

ఆలమూరు: మృగశిర కార్తె ప్రారంభం కావడంతో గ్రీష్మ ఋతువు వచ్చేసింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. నాడు మోడు వారిన చెట్లు నేడు పచ్చని ఆకులు, రంగు రంగుల పుష్పాలతో చూడ ముచ్చటగా చూపరులకు ఇంపును కలిగిస్తున్నాయి. మోడు వారిన జీవితాలు ఎన్నడూ అలాగే ఉండవని, వికసించక మానవు అనే సూక్తిని నిజం చేస్తూ 216 ఏ జాతీయ రహదారిలోనిమూలస్థాన అగ్రహారం వద్ద తురాయి చెట్లు నిరూపిస్తున్నాయి. అక్కడ నాడు మోడు వారిన తురాయి చెట్లు వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నేడు చక్కటి పూలవనాలయ్యాయి. వేసవికాలం ధాటికి నెల రోజుల క్రితం చెట్లు అంతా ఎండిపోయి కళావిహీనంగా మారింది. మానవ జీవితానికి ఈ చెట్లు దగ్గరగా ఉన్నట్లు భావించాల్సిన అవసరం ఎంతైన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కోటిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది




ద్రాక్షారామలో నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ

కె.గంగవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పించడంతో పాటు, సరైన పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. మండలంలోని కోటిపల్లిలో గురువారం రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం 5 నుంచి 6 సంవత్సరాలు నిండిన చిన్నారులను స్కూల్‌కు పంపించి, నూతన చిన్నారులను కేంద్రాలకు ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు సంక్షేమం అందిస్తుందని చెప్పారు.

**అంగన్‌వాడీ పిలుస్తోంది**

రామచంద్రపురం రూరల్: ఆటపాటలతో విద్య, క్రమశిక్షణతో వ్యక్తిత్వ వికాసం అందించే అంగన్‌వాడీల్లో మీ చిన్నారులను చేర్పించాలంటూ సీడీపీఓ వరాహలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని ద్రాక్షారామ సెక్టార్‌లో 187వ సెంటర్ వద్ద గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయలు వసూలు చేసి అందించే ఎల్‌కేజీ, యూకేజీ విద్యలను అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ విద్యను అందించడం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి తల్లిదండ్రులూ అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి.సూర్యావతి, ఏఎన్ఎం నాగవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: అధికారులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం మండలంలో 12 గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించారు. మారేడుబాక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఆర్ఐ కంఠంశెట్టి గౌరి, వీఆర్వోలు, వీఆర్ఏలు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ పారదర్శక సేవల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, ఉప సర్పంచ్ గంటి దుర్గారావు, ఎంపీటీసీ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.




మారేడుబాక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల



ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి, సిబ్బంది



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న నాగమణి



వీఆర్వో సాయిబాబును సత్కరిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్ తదితరులు

**ప్రాచీన శాఖ రెవెన్యూ**

రాయవరం: దేశంలో అతి పురాతనమైన ప్రాచీన శాఖ రెవెన్యూ అని తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు, ఆర్ఐ పంపన రామారావు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజుల కాలం నుంచి రెవెన్యూ వ్యవస్థ ఉండగా, నాటి రోజుల్లో రాజ్యాలకు భూ ఆదాయమే ప్రధాన వనరుగా ఉండేదన్నారు. భూమి శిస్తును వసూలు చేసింది రెవెన్యూ ఉద్యోగులేనన్నారు. 1772 మే 14న బెంగాల్ గవర్నర్ వారన్ హేస్టింగ్ భూమి శిస్తు వసూళ్లకు కలెక్టర్ల వ్యవస్థను తీసుకు వచ్చారన్నారు. నాటి నుంచి భూమి శిస్తు రికార్డుల నిర్వహణ, వసూళ్లలో రెవెన్యూ శాఖ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**ప్రజలతో రెవెన్యూ వ్యవస్థకు విడదీయరాని బంధం**

కాజులూరు: ప్రజలకు తరచూ ఏదో విధంగా రెవెన్యూ సర్వీసులు అవసరమౌతాయని, రెవిన్యూ వ్యవస్థకి ప్రజలతో విడదీయరాని బంధం ఉంటుందని మండల తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి అన్నారు. రెవెన్యూ డే పురస్కరించుకుని గురువారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది కాజులూరు గ్రామ వీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించి రెవెన్యూ సర్వీసులు, ప్రజలతో అనుబంధంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఉద్యోగవిరమణ చేసిన పలువురు రెవెన్యూ ఉద్యోగులను సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీటీ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ పి.వేగేశ్వరరావు, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, పలు గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

**వీఆర్వోను సత్కరించిన ఆర్డీఓ**

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ వీఆర్వో కాకినాడ సాయిబాబును రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ గురువారం సత్కరించారు. రెవెన్యూ, ఎలక్షన్ డ్యూటీలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను, రెవెన్యూ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్డీఓ సాయిబాబును దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీటీ కర్రి మహాలక్ష్మినాయుడు, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, వీఆర్వోలు, వీఎస్‌లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

**నాగమణికి ఉత్తమ సేవా పురస్కారం**

కపిలేశ్వరపురం: అంగర వీఆర్వో పెద్దింశెట్టి నాగమణిని ఉత్తమ సేవా పురస్కారంతో కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం సత్కరించారు. రెవెన్యూ డే సందర్భంగా జిల్లా కేంద్రం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు పొందిన రెవెన్యూ అధికారులను సత్కరించారు. వీఆర్వో విభాగంలో నాగమణి ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆమెకు సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, రెవెన్యూ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా కనకమహాలక్ష్మమ్మ జాతర

రావులపాలెం: ఊబలంక గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని చిన్న పిల్లలతో దివిటీలు(కాగడాలు) వేయించి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారి గరగలతో పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్‌మేళాలు, గరగనృత్యాలు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అలాగే టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.